క్లుప్తంగా

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేయండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రానున్న ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ నివేదికపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లాలోని విద్యుత్ అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. విద్యుత్ భవన్‌లోని తన చాంబర్ నుంచి జిల్లాలోని విద్యుత్ శాఖ ఈఈలు, డీఈఈలు, ఏఈలు, అకౌంట్స్ ఆఫీసర్లతో సోమవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణను ఏపీ ఈఆర్సీ చైర్మన్ సీవీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజన్లలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు ఈఈలు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జీఐఎస్ ప్రక్రియలో ఉదయగిరి, వరికుంటపాడు, మర్రిపాడు, రాపూరు, చిట్టమూరు సెక్షన్లు వెనుకబడి ఉన్నాయని, ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లను నిరంతరం పరిశీలిస్తూ లోపాలను గుర్తించి సకాలంలో మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎస్పీడీసీఎల్ రూపొందించిన రైతునేస్తం యాప్ ద్వారా వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు 30 రోజుల్లో అందజేయాలన్నారు.

ధర్మ ప్రచార వారోత్సవాలు ప్రారంభం

నెల్లూరు(బృందావనం): ధర్మ ప్రచార వారోత్సవాలను పురస్కరించుకొని మినీబైపాస్ రోడ్డులోని కోటి ఇంద్రావతి ఫంక్షన్ హాల్లో స్వామి వారి కల్యాణోత్సవాన్ని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థాన ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులు కుటుంబసభ్యులు వ్యవహరించారు.

➡ శెట్టిగుంటరోడ్డులోని సత్రం బడిలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన ఆధ్వర్యంలో జరిపారు.

అవార్డుల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో సేవారత్న, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను 25 కళాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం అందజేయనున్నామని కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్లను గాంధీబొమ్మ సమీపంలోని కళాసంఘాల చాంబర్‌లో సోమవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్‌కు సేవా రత్న, 25 కళాసంఘాల లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేయనున్నామని వివరించారు. చాగణం ట్రస్ట్ సీఈఓ సీతారామనాయుడు, ఏఓ కృష్ణ, అవెన్యూస్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణచైతన్య, సీహెచ్ఎల్బీ గ్రూప్ జీఎం రుషికేశవరావు, దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు నేడు

నెల్లూరు రూరల్: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో పరీక్షలపై చర్చ, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను మంగళవారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శంకరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ విద్యాలయం నుంచి 10, స్టేట్ బోర్డు స్కూళ్ల నుంచి 50, సీబీఎస్ఈ స్కూళ్ల నుంచి 30, కేంద్రీయ విద్యాలయం నుంచి పది మంది విద్యార్థులు పాల్గొననున్నారని చెప్పారు. తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. విజేతలకు డిజిటల్ సర్టిఫికెట్లతో పాటు స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను బహుమతిగా అందజేయనున్నామని వివరించారు.

ఎంపీ ఆదాలపై దుష్ప్రచారం తగదు

నెల్లూరు(దర్గామిట్ట): ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారం సాగిస్తున్నారని పార్టీ యువజన విభాగ అధికార ప్రతినిధి ప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ యువజన విభాగ జిల్లా జనరల్ సెక్రటరీ వంశీతో కలిసి విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఆదాలపై బురదజల్లేందుకు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఆదాల గెలుస్తారనే భయంతో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అండర్ – 14 సౌత్‌జోన్ నేషనల్ లెవల్ చాంపియన్‌షిప్ క్రికెట్ పోటీల్లో బీవీఎస్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయురాలు విజయ జ్యోతి తెలిపారు. పాఠశాలలో విద్యార్థినులను సోమవారం అభినందించిన అనంతరం ఆమె మాట్లాడారు. సౌత్ జోన్ అండర్ – 14 నేషనల్ లెవల్ చాంపియన్‌షిప్ క్రికెట్ పోటీలను తమిళనాడులో ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించారని, ఇందులో రాష్ట్ర బాలికల జట్టులో తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు తులసీ, అక్షిత, తొమ్మిదో తరగతికి చెందిన రేష్మా ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు.



శివాజీ సెంటర్‌లో శోభాయాత్ర



పూజల్లో దీపా వెంకట్



చిన్నారుల నృత్య ప్రదర్శన

అంతా.. రామమయం

- వాడవాడలా బాలరాముడి ప్రతిష్ట వేడుకలు
- సింహపురిలో ఆధ్యాత్మిక శోభ

నెల్లూరు(బృందావనం): శ్రీరామ జన్మభూమి అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని భక్తిపారవశ్యంతో సింహపురి సోమవారం పరవశించింది. జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్ నినాదాలు.. రామనామ స్మరణ.. రామాయణ నృత్య రూపకాలు.. పూజలు.. కీర్తనలు.. శోభాయాత్రతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. బాలరాముడి ప్రతిష్ట మహోత్సవాన్ని వీక్షించేందుకు వీలుగా నగరంలోని కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్లను వీహెచ్‌పీ తదితర సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

➡ బాలరాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం భారతావనికి శుభపరిణామమని ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరామ్ సురేష్, అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బైసాని జ్యోతి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, వైభవ్ శ్రీనివాసులు, పేర్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

➡ శ్రీరామచంద్రమూర్తి బాలరాముడిగా అయోధ్యలో కొలువైన రోజును భారతీయులెప్పటికీ మరువరని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ పేర్కొన్నారు. గాంధీబొమ్మ సమీపంలోని వరసిద్ధి వినాయక దేవస్థానం వద్ద బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి ఘట్టాన్ని వీక్షించేలా చర్యలు చేపట్టారు. శ్రీరామచంద్రమూర్తి తాత్కాలిక విగ్రహ ప్రతిష్ట, భజనలు, కీర్తనలు, భగవద్‌రామాయణ నృత్యరూపకం, సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుడికి పుష్పాభిషేకం తదితరాలను నిర్వహించారు. బీజేపీ నేతలు వాకాటి నారాయణరెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, ధార్మిక సంస్థలకు చెందిన నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, బయ్యా వాసు, సీపా వంశీధర్‌రెడ్డి, వేలూరు మహేష్, సురేంద్రరెడ్డి, మోదెం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

➡ మినీబైపాస్ రోడ్డులోని పీటీజీ గోపాలచారి పెట్రోల్ బంక్ వద్ద విశేష కార్యక్రమాలను జగన్నాథం, పద్మజ దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రసాదాలను పంపిణీ చేశారు. వాసు, కమలమ్మ, నరసింహన్, జయశ్రీ, యదునందన్, విద్య, దూబగుంట వెంకటేశ్వరరావు, మహాలక్ష్మి దంపతులు, విష్ణుతేజ తదితరులు పాల్గొన్నారు.

➡ మండపాలవీధి, చిన్నబజార్, పెద్దబజార్, కాపు వీధి తదితర ప్రాంతాల్లో శోభాయాత్రను కనులపండువగా నిర్వహించారు. మెంటా రామ్మోహన్‌రావు, కందికట్ల రాజేశ్వరి, సుజన, మారం విజయలక్ష్మి లక్ష్మీప్రియ, మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ సుబేదారుపేటలోని మేరీనాయుడివీధిలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని మేదర సంఘ ఆధ్వర్యంలో అందజేశారు. సత్యనారాయణ, నాగినేని ప్రభాకర్, హేమరామచంద్రారెడ్డి, సుబ్బరాయుడు, ఆనంద్, జగన్, దుర్గ, శీనయ్య, సుబ్రహ్మణ్యం, విజయ తదితరులు పాల్గొన్నారు.

➡ నగరంలోని సన్నిధి కార్యాలయంలో బాలరాముడి ప్రతిష్ట వేడుకలను ఆధ్యాత్మికవేత్త అల్లు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కవి పెరుగు రామకృష్ణ, రచయిత టేకుమళ్ల వెంకటప్పయ్య, కోడూరు ప్రభాకర్‌రెడ్డి, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ భక్తవత్సలనగర్‌లోని బాబా మందిరం నుంచి రాజు కాంప్లెక్స్ వరకు శోభాయాత్రను భక్తి సేవాదళ్ సమితి శ్రీకంఠం మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

నెల్లూరు సిటీ: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని చిన్నారులు వీక్షించేందుకు వీలుగా నగరంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో టీవీలను ఏర్పాటు చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని ఆర్టీసీ కాలనీలో అన్నదానాన్ని నిర్వహించారు. గుంటి కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాంబశివరావు, సుధాకర్, చెన్నకేశవులు, నారాయణ, కిశోర్, ఈశ్వరయ్య, శేఖరయ్య, శ్రీనివాసులు, రాజా, చిన్నా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో..



విశేషాలంకారంలో సీతారాముడు



ఉత్సాహంగా ర్యాలీ

సుబ్రహ్మణ్యస్వామి షష్టి పుస్తకావిష్కరణ

నెల్లూరు(దర్గామిట్ట): రచయిత, విశ్రాంత తహసీల్దార్ దంపూరు రామకృష్ణ రచించిన సుబ్రహ్మణ్య స్వామి షష్టి పుస్తకాన్ని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కనుపర్తిపాడులో వెలసిన నాగేంద్ర సహిత వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ విశేషాలు తదితరాలను పొందుపర్చామని రచయిత తెలిపారు. నగరంలోని ఎంపీ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఏఓ ఏలూరు శ్రీనివాసులు, రచయిత ఈతకోట సుబ్బారావు, పొన్నగంటి సాయికృష్ణ, విశ్రాంత తహసీల్దార్ ధూర్జటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణాధికారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ ఆధ్వర్యంలో ప్రచురించిన వ్యవసాయ సమాచార దర్శిని డైరీని నగరంలోని తన నివాసంలో మంత్రి సోమవారం ఆవిష్కరించారు. ఏఓఈల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేణు, మాధవరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సుభానీ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అధ్యక్షులు వెంకటరమణయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి

రోడ్డు పనులకు శంకుస్థాపన



నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరు మెయిన్‌లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నవాబ్‌జాన్, మాజీ ఎంపీటీసీ ఖాదర్‌బాషా సోమవారం చేపట్టారు. ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

నెల్లూరు రూరల్: జిల్లాలో బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ జిల్లా ఇన్‌చార్జి శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు కోడూరుపాడులో సోమవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి తగు చర్యలను చేపడుతున్నామని చెప్పారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

నెల్లూరు(బారకాసు): కేంద్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు నెల్లూరు సిటీ నియోజకవర్గం – 117 ఓటర్ల తుది జాబితాను కమిషనర్ వికాస్ మర్మత్ విడుదల చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలను అన్ని పోలింగ్ కేంద్రాలతో పాటు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రదర్శనకు ఉంచామని తెలిపారు. బీఎల్వోల ఇంటింటి విచారణ అనంతరం, అన్ని రకాల ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాను రూపొందించామని వెల్లడించారు. వివిధ దరఖాస్తుల ద్వారా అందిన 92,500 ఓటర్ల సవరణలను అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని చెప్పారు. నూతన ఓటర్ల నమోదుకు సంబంధించి 58 వేల దరఖాస్తులు అందగా, ముగ్గురు ఏఈఆర్వోల పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, అర్హులకు ఓటు హక్కును కల్పించామని వివరించారు. జాబితాను ఓటర్లు పరిశీలించి వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ఏఈఆర్వోలు దేవీకుమారి, నిర్మలానందబాబా, మాధవి, చక్రపాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



విడుదల చేస్తున్న వికాస్ మర్మత్ తదితరులు

నేటి నుంచి ఎఫ్‌ఏ - 3 పరీక్షలు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి ఈ నెల 29 వరకు ఎఫ్ఏ – 3 (ఫార్మేటివ్ అసెస్‌మెంట్) పరీక్షలను నిర్వహించనున్నారు. ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఎఫ్ ఏ – 3.. 9, 10 తరగతుల విద్యార్థులకు సీబీఏ – 2 (క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్) పరీక్షలను జరపనున్నారు. ఈ పరీక్షలను ప్రభుత్వం అందజేసిన ఓఎమ్మార్ షీట్లలో రాయాల్సి ఉంటుంది. ఎఫ్ఏ – 3 పరీక్షలకు తప్పక హాజరు కావాల్సి ఉంది. జిల్లాలో 3.2 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

నెల్లూరు(బారకాసు): అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీలను ప్రజలు ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. స్పందనలో వివిధ సమస్యలపై 38 అర్జీలు అందాయని, నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు.

➡ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కమిషనర్ నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజీవ్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి, హరికృష్ణ, శ్రీధర్, ఎన్నికల విభాగాధికారులు దేవీకుమారి, నిర్మలానందబాబా, శ్రీనివాసులు, ధనుంజయరెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ప్రచార వాహనం, శిబిరాల ద్వారా అవగాహన క్యాంపులను స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల రోడ్డు, బ్రాహ్మణవీధి వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులందరికీ వర్తింపజేయాలని సూచించారు. నగరపాలక సంస్థ సెక్రటరీ హేమావతి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పట్టణ ప్రగతి యూనిట్ ప్రారంభం

నెల్లూరు(బారకాసు): సుబేదారుపేటలోని నెల్లూరు పట్టణ సమాఖ్య – 4 పరిధిలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రగతి యూనిట్‌ను మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర సోమవారం ప్రారంభించారు. కార్పొరేటర్ సాహిత్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి సురేష్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు శాంతి, మెప్మా సిబ్బంది సుధాకర్, సీఎంఎం పెంచలయ్య, సీఓ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల్లో విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని వివిధ దేవస్థానాల్లో విశేష పూజలను సోమవారం నిర్వహించారు.

➡ నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో సీతారామచంద్రస్వామి వారికి ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను నిర్వహించారు. ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థాన ఈఓ ఉషా తదితరులు పాల్గొన్నారు.

➡ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అఖండ దీపారాధనను నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

➡ విరాట్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ నిర్వాహకులు కందుకూరు చెంగయ్య ఆచారి, ఇందుకూరు రమేష్‌కుమార్, కందుకూరు జనార్దన్, లోకనాథం, శ్రీనివాసులు, మురళీకృష్ణ శ్రేష్టి తదితరులు పాల్గొన్నారు.

➡ మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో అఖండ హరేరామ నామసంకీర్తన, భజనలను నిర్వహించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు వేణుబాబు, మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో స్వామివారికి పూజలు చేశారు. మందిర కమిటీ నిర్వాహకులు వెంకటేశ్వర్లుగుప్తా, రత్నం, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

➡ సుజాతమ్మ కాలనీలోని కృష్ణ, అష్టలక్ష్మి మందిర ప్రాంగణంలో వెయ్యి దీపాలతో ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులకు తిరుమల వెంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీరాముడికి విశేష పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రంగడి ఆలయంలో..



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో..



కృష్ణ మందిరంలో..



సీతారామస్వామి మందిరంలో..



నరసింహకొండలో..



అష్టలక్ష్మి మందిర ప్రాంగణంలో..